క్లుప్తంగా

ఘనంగా శ్రావణమాస పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు

దౌల్తాబాద్: శ్రావణమాసం సందర్భంగా శనివారం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయాన్నే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోకఫసల్‌వాద్ ఓదం కుంట ఆంజనేయ స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం అన్నదానం చేశారు.

ఎరుకల సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గంతో సంఘం సభ్యులు, జిల్లా అధ్యక్షుడు

దౌల్తాబాద్: ఎరుకల సంఘం దౌల్తాబాద్ మండలం నూతన కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బాలరాజు, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, సంయుక్త కార్యదర్శిగా చంద్రప్ప, పకీరప్పలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. వెనుకబడిన ఎరుకల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య పాల్గొన్నారు.

'సమగ్రశిక్ష' ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవే..



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నేతలు

యాలాల: సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల కోరికలు న్యాయమైనవని పీఆర్‌టీయూ సంఘం నాయకులు అన్నారు. డిమాండ్ల సాధన కోసం సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు శనివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, తాండూరు మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాం నర్సింహ్మారెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్లను తమ సంఘం రాష్ట్ర బాధ్యుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సరైన పనికి సరైన వేతనం డిమాండ్‌తో చేపడుతున్న సమ్మె న్యాయమైనదని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల వంటావార్పు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగులు శనివారం వికారాబాద్ పర్యటనకు వచ్చిన సమాచార శాఖ మంత్రి మహేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నిరసనలో భాగంగా వంట వార్పు చేపట్టారు. రోడ్డుపైనే కూర్చుని సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజానాయక్, మహిళా అధ్యక్షురాలు స్వప్న రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలి



సంజయ్‌బంగాతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు

తాండూరు రూరల్: తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామ శివారులో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ఫ్యాక్టరీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం సీసీఐ సీఎండీ సంజయ్ బంగను హైదరాబాద్‌లోని సీసీఐ కేంద్ర కార్యాలయంలో కలిసి.. కార్మికుల గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. అదే విధంగా ఆదిలాబాద్‌లోని సీసీఐ కర్మాగారం కేసుకు పరిష్కారం చూపాలన్నారు. సీఎండీని కలిసిన వారిలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రతినిధులు యూసుఫ్, చంద్రయ్య, విలాస్ ఉన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్

- పట్టించుకోని ఆర్టీసీ
- రోడ్లమీదే ప్రయాణికుల నిరీక్షణ



బార్వాద్ తండా గేటు వద్ద బస్ షెల్టర్ దుస్థితి

బంట్వారం: నాడు బస్సుల రాకపోకలు, ప్రయాణికుల సందడితో కళకళలాడిన ప్రయాణ ప్రాంగణాలు నేడు వెలవెలబోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లోపం వెరసి ఆర్టీసీ బస్ షెల్టర్లు దుమ్ముధూళితో అపరిశుభ్రంతో నిండిపోయి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు చెట్లకింద, రోడ్ల మీదే నిరీక్షిస్తున్నారు. కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లి, జిన్నారం బస్ షెల్టర్లు పశువుల పాకలుగా దర్శనమిస్తున్నాయి. వర్షం వస్తే చాలు అవి పశువుల కొట్టాన్ని తలపిస్తున్నాయి.

లక్షలు వెచ్చించి..

ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మోత్కుపల్లి గేటు, బార్వాద్ తండా, ఓగులాపూర్, నాగసాన్‌పల్లి, ఎన్నారం, బంట్వారం మండలం యాచారం గేటు సమీప బస్ షెల్టర్లు అధికారుల నిర్లక్ష్యానికి వృథాగా మిగిలాయని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు అనుకూలంగా మార్చాలని కోరుతున్నారు.



మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలను శనివారం బీఆర్‌ఎస్ యాలాల మండల నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, యువ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు. - యాలాల

ఎస్సీ వర్గీకరణ విస్మరించిన కేంద్రం

పార్లమెంటులో మాట్లాడండి
ఎంపీని కోరిన ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎంపీ రంజిత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాండూరు టౌన్: రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ గురించి మాట్లాడాలని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డికి ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం తాండూరులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోరాట సమితి జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ మాదిగ మాట్లాడారు. 29 ఏళ్లుగా మాదిగ రిజర్వేషన్ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పిన బీజేపీ, 9 ఏళ్లు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, 2017లో నిండు అసెంబ్లీలో సీఎం కేసీఆర్ మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. స్పందించిన ఎంపీ గతంలో పార్లమెంటులో వర్గీకరణ గురించి మాట్లాడామని, వాయిదా తీర్మానాన్ని సైతం కోరామని, ఈసారి కూడా అంశాన్ని లేవనెత్తుతానని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. ఇందులో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రకాష్, అంజి, జాని, శివాజీ, మోహన్, నవీన్ తదితరులు ఉన్నారు.

పాత పింఛన్ ప్రభుత్వానికి భారం కాదు

- ఓపీఎస్ విధానంతో అందరికీ మేలు
- ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి సీపీఎస్ ఉద్యోగుల వినతి
- ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు యువత విన్నపం



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కొడంగల్ రూరల్: సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్‌ను అమలు చేయాలని కోరుతూ శనివారం సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల అనిల్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. పాత పెన్షన్ అమలు చేయడం ద్వారా ప్రభుత్వానికి లాభమే కాని, ఎలాంటి భారం ఉండబోదని, సీపీఎస్‌ను రద్దుచేస్తే ప్రభుత్వానికి నెలనెలా రూ.15 వేల కోట్లకు పైగా మిగులుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో పాత పింఛన్ అమలులో ఉందని, తెలంగాణలో అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఓపీఎస్ అమలు చేసి ఆదర్శంగా రాష్ట్రంగా నిలవాలని ఆకాంక్షించారు. తమ సమస్యలు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర సాహిత్య సభ్యుడు మురహరినాథ్, మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి దినేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అశోక్ కుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, జిల్లా అగ్రికల్చర్ శాఖ కోఆర్డినేటర్ ఐజాక్, మండల నాయకులు కరుణాకర్, రమేష్, కృష్ణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయండి

నియోజకవర్గ కేంద్రం కొడంగల్‌లో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని పలువురు యువకులు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. స్టేడియం ఏర్పాటు చేస్తే నియోజకవర్గ ప్రాంత యువతకు ఎంతగానో మేలు జరుగుతుందని ఎమ్మెల్యేకు విన్నవించారు.

బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పలువురు మైనార్టీలు జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ గౌస్, టౌన్ ప్రెసిడెంట్ గఫార్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీలో చేరుతున్న కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే రానున్న సాధారణ ఎన్నికల్లో తమ విజయాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు అశోక్, రమేష్ మిత్ర, నాయకులు రాచన్న, సంజీవరెడ్డి, ఉప సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జీవనం కష్టంగా ఉంది.. పింఛన్ ఇవ్వండి

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

వికారాబాద్ అర్బన్: ఉద్యోగ విరమణ అనంతరం జీవనం కష్టంగా మారిందని, ఆసరా పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సంగయ్య, సాయన్న, రహీం, బీ.ఆర్.రెడ్డి తదితరులు ఒక ప్రకటనలో కోరారు. టీఎస్ ఆర్టీసీలో 40 ఏళ్ల పాటు పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన వారు రాష్ట్ర వ్యాప్తంగా 33వేల మంది ఉన్నారని, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో సంస్థ ఉద్యోగులుగా వారంతా పోరాటం చేశారని పేర్కొన్నారు. 27 రోజుల పాటు బస్సులు ఆపి, తమ ఆకాంక్షను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెప్పినట్లు వెల్లడించారు. అదే విధంగా సంస్థలో ఉద్యోగ విరమణ అనంతరం వర్తించే ఎస్ఆర్‌బీఎస్‌కు ఆర్థిక సహాయం చేసి, ఇప్పుడున్న స్కీంను సవరించి కనీసం నెలకు రూ.5వేలు వచ్చేలా చూడాలని కోరారు.

16న బీఎస్పీ బహిరంగ సభ

మర్పల్లి: ఈ నెల 16న మర్పల్లిలో బహుజన సమాజ్ పార్టీ భారీ బహిరంగా సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వికారాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి తలారి రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనసభ ఎన్నికలను పురస్కరించుకొని చేపట్టే సభకు పార్టీ సెంట్రల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు శ్రీరాంజీ గౌతమ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు కానున్నారని ఆయన చెప్పారు. సభను విజయవంతం చేసేందుకు భారీ ఎత్తున జన సమీకరణ చేపట్టాలని మండల నాయకులకు సూచించారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కో కన్వీనర్ సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి కావలి ప్రభాకర్, కార్యదర్శి మస్తాన్, ఆర్గనైజర్లు విజయ్, శ్రీను, ప్రేమ్‌కుమార్, సంపత్, ఉదయ్ తదితరులు ఉన్నారు.

బహుజనుల సంక్షేమమే లక్ష్యం



పార్టీ జెండా ఎగురవేస్తున్న నర్మదకిష్టప్ప

దౌల్తాబాద్: బహుజనుల సంక్షేమం, అభివృద్ధే బీఎస్పీ లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద కిష్టప్ప అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం అంతారంలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడానికి పార్టీని బలోపేతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తం, నాయకులు మాణిక్యప్ప, రమేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రామలింగేశ్వర జాతర



ముస్తాబైన ఆలయం



కొలువైన రామలింగేశ్వరస్వామి

మోమిన్‌పేట: శ్రావణమాసం ఆఖరి సోమవారం సందర్భంగా ప్రత్యేకపూజలు అందుకునేందుకు రామలింగేశ్వరస్వామి ముస్తాబయ్యారు. ఆహ్లాదకరమైన వాతావరణం, చుట్టూ బండ రాళ్ల నడుమ దేవాలయం ఎదుట నుంచి జలజల పారుతున్న నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వరుడికి శ్రవణమాసంలో ఆఖరి శనివారం, సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహిస్తే స్వామి అనుగ్రహిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇక్కడి కొలను నుంచి జలాన్ని తీసుకెళ్లి పంట పొలంలో చల్లితే క్రిమికీటకాలు పంటను ఆశించవని రైతుల నమ్మకం. నాడు శ్రీరాముడే స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారని, అందుకే రామలింగేశ్వర స్వామిగా ప్రఖ్యాతిగాంచినట్లు ప్రచారంలో ఉంది. ఈ ఆఖరి సోమవారం పూజా కార్యక్రమాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా, మెదక్ జిల్లా నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పూజా కార్యక్రమాలు

సోమవారం ఉదయం 5గంటల నుంచి 6గంటల వరకు సుప్రభాత సేవ, 6గంటల నుంచి 7గంటల వరకు స్వామి వారి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం. 7గంటల నుంచి 7.30 గంటల వరకు మహా హారతి, 7.30 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు భక్తులకు స్వామి దర్శనం ఇవ్వనున్నారు.

కార్మికుల సమస్యలు పట్టని సర్కార్

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి
- కార్మిక సంఘం వికారాబాద్ అధ్యక్షుడు చిన్నయ్య



నిరసన వ్యక్తంచేస్తున్న కార్మికులు

వికారాబాద్ అర్బన్: మూడు వారాలుగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సంఘం వికారాబాద్ అధ్యక్షుడు చిన్నయ్య అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు, జవాన్లు, ఇతర విభాగాల్లో పనిచేసే 264 మంది కార్మికులు 20 రోజులుగా సమ్మె చేస్తున్నారని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం దిగిరాకుంటే పనులు మానేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వినోద్, దాహుద్, అశోక్, జగదీష్, నాగేందర్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అన్ని వర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే ఆయన నివాసంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంగా మారిందని, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి మెరుగైన చికిత్స కోసం అది ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ భాస్కర్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించిన కాళోజీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్: తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, ప్రజల మనిషిగా, స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించిన మేధావి ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని ప్రిన్సిపాల్ బలరాం కొనియాడారు. మున్సిపాలిటీ పరిధి పాతకొడంగల్ గిరిజన గురుకుల పాఠశాలలో శనివారం తెలంగాణ భాష దినోత్సవంతో పాటు కాళోజీ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లపై చిన్నచూపు తగదు

- పట్టించుకోని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు
- హక్కుల సాధనకు కలిసి రావాలి
- సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మంతు ముదిరాజ్

దోమ: హక్కుల సాధన కోసం ముదిరాజ్‌లు పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మంతు ముదిరాజ్ అన్నారు. శనివారం దోమ మండలం బొంపల్లి, బాస్‌పల్లి, దొంగఎన్కేపల్లి గ్రామాల్లో సంఘం నేతలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ముదిరాజ్‌ల సంఖ్య అధికంగా ఉందని, అయినా ఏ రాజకీయ పార్టీ, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హక్కులు, రిజర్వేషన్ల కల్పనలో చిన్నచూపు చూస్తున్నాయని మండిపడ్డారు.

15న పరిగిలో భారీ ర్యాలీ

బీసీ(డి) నుంచి బీసీ(ఏ)లోకి మార్చాలని పలు మార్లు నిరసన వ్యక్తం చేసినా ఫలితం లేకుండా పోయిందని ముదిరాజ్ నాయకులు విమర్శించారు. ఇప్పటికైనా హక్కుల సాధనకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈ నెల 15న పరిగి పట్టణం కొడంగల్ చౌరస్తా నుంచి మార్కెట్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరగనుందని, ముదిరాజ్‌లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పరిగి తాలూకా అధ్యక్షుడు రామస్వామి ముదిరాజ్, ఉపాధ్యక్షుడు హన్మంతు, సలహాదారులు బిచ్చయ్య, మండల ప్రధానకార్యదర్శి చందు, బొంపల్లి అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధానకార్యదర్శి యాదయ్య, సంఘం నేతలు జంగయ్య, నర్సింహులు, కృష్ణయ్య, బాబు, శ్రీనివాస్, బుగ్గయ్య, రాములు, శ్రీనివాస్, రాఘవేందర్, బంటు నర్సింహులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హన్మంతు ముదిరాజ్ తదితరులు

పశువులపై సీజనల్ వ్యాధుల దాడి

రైతులు అప్రమత్తంగా ఉండాలి: పశువైద్యులు



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దోమ: పశువులను సీజనల్ వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని పశువైద్యులు, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతుకుమార్ సూచించారు. శనివారం దోమ మండలం ఖమ్మంనాచారం, మోత్కూర్ తదితర గ్రామాల్లో శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పశువైద్యులు పున్నయ్య, పద్మాకర్ రావు, మండల పశువైద్యుడు ఆనంద్ సుమారు 200 పశువులకు వైద్య చికిత్సలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వెంకటయ్య, రమేశ్, మోతీలాల్, రాములు, రాజు, సారంగి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.